# సాక్షి నిజామాబాద్

గురువారం । 15 । జూన్ । 2023






**కీలకపోస్టులు ఖాళీ!**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీపీతో పాటు రెండు డీసీపీ పోస్టులు ఖాళీ అయినా ప్రభుత్వం భర్తీ చేయడంలేదు.

- 4లో ▸



**విధుల్లో నిర్లక్ష్యం సహించబోం**

విధులపై ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోమని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.

- 4లో ▸

గరిష్టం/కనిష్టం **40.6 /27.4**

**వాతావరణం**

ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ఇద్దరు సీఐల బదిలీ

**ఖలీల్‌వాడి:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు సీఐలు బదిలీ అయ్యారు. మల్టీజోన్ పరిధిలో బుధవారం 16 మంది సీఐలను బదిలీ చేయగా ఇందులో నిజామాబాద్ నార్త్ సీఐ భూక్య నరహరిని సీసీఆర్‌బీలోకి ట్రాన్స్‌ఫర్ చేశారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని తాండూర్ సీఐగా ఉన్న సతీశ్‌ను నిజామాబాద్ నార్త్ సీఐగా బదిలీ చేశారు. సీసీఆర్‌బీలో ఉన్న సీఐ మోహన్‌కు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. పీసీఆర్, నిజామాబాద్‌లో పనిచేస్తున్న సీఐ రాజమౌళి సీసీఎస్ సిరిసిల్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

### అధిష్టానం ఆదేశిస్తే 'రూరల్' నుంచి పోటీ

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్ రెడ్డి



**ఇందల్వాయి:** కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్ రెడ్డి ప్రకటించారు. ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పంట విక్రయించి నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ధాన్యం డబ్బులు రావడం లేదన్నారు. రైతుబంధు సకాలంలో ఇవ్వకపోవడం, ఇష్టరీతిన ధాన్యం కట్తా తీయడం, పైపులైన్ల ద్వారా మూడెకరాలకు ఒక గేట్‌వాల్ బిగించి సాగు నీటిని అందిస్తానని ఇవ్వకపోవడం, మంచిప్ప ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేయడం స్థానిక ఎమ్మెల్యే వైఫల్యాలన్నారు. వెంటనే ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, తలారి సుధాకర్, కరుణాకర్, మండల యూత్ అధ్యక్షుడు రాజు, గంగారాం, మల్లేశ్ పాల్గొన్నారు.


### నిజామాబాద్ 'రెడ్‌క్రాస్'కు ఐఎస్‌వో గుర్తింపు

- గవర్నర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేత



**నిజామాబాద్ సిటీ:** జిల్లా రెడ్ క్రాస్‌కు ఐఎస్‌వో గుర్తింపు వచ్చింది. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ నిజామాబాద్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తోట రాజశేఖర్‌లు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. గత శనివారం ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ సభ్యులు నిజామాబాద్ రెడ్‌క్రాస్ కేంద్రానికి వచ్చి తనిఖీ చేసి సంస్థ వివరాలు, చేపడుతున్న కార్యక్రమాలు అలాగే కేంద్రం పరిశుభ్రత, రక్త సేకరణ నాణ్యత, పరిమాణాలపై ఐఎస్‌వో సరిఫికెట్‌ను జారీ చేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ తమిళిసై సౌందరాజన్ జిల్లా రెడ్‌క్రాస్ కార్యవర్గాన్ని ప్రశంసిస్తూ సర్టిఫికెట్‌ను అందజేశారు. అలాగే రెడ్‌క్రాస్‌లో ఎక్కువ సార్లు రక్త దానం చేసిన నిజామాబాద్ జిల్లా కోర్టు ఉద్యోగి నాగేందర్‌ను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి కరిపె రవీందర్ పాల్గొన్నారు.

### రాష్ట్ర ప్రజలను వంచించిన కేసీఆర్



**బాల్కొండ:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను వంచించాడని ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్ ఆరోపించారు. బుధవారం ముప్కాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు చేపట్టే సంక్షేమ పథకాలను వివరించారు.

**రూ.2 లక్షల రుణమాఫీ..**

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. వంట గ్యాస్ సిలిండర్ రూ.500 కే అందిస్తామన్నారు. పీసీసీ డెలిగేట్ క్యాతం గంగారెడ్డి, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు నీరడి భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నేతల క్యూ..

- జిల్లాలో బీజేపీ అగ్ర నాయకుల వరుస పర్యటనలు
- సునీల్ బన్సల్, ప్రకాశ్ జవదేకర్‌ల రాక
- మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా పలు కార్యక్రమాలు
- వివిధ వర్గాలను కలిసేవిధంగా ప్రణాళికలు
- త్వరలో మరికొందరు నేతలతో భారీ బహిరంగ సభకు కసరత్తు



జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయాన్ని పరిశీలిస్తున్న, బీజేపీ జాతీయనేత సునీల్ బన్సల్(ఫైల్)

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ :** ఎన్నికల ఏడాది కావడంతో బీజేపీ కార్యకలాపాల్లో స్పీడ్ మరింత పెరుగుతోంది. నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలన విషయమై ప్రజలకు వివరించేందుకు పార్టీ నాయకత్వం 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని రూపొందించుకుని ముందుకు వెళ్తోంది. ఇందులో భాగంగా వరుసగా బీజేపీ జాతీయ నాయకులు నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వరుసగా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ వివిధ వర్గాలను కలుస్తున్నారు. జిల్లాలో వివిధ మండలాల్లో జాతీయ నాయకులు జల్లెడ పడుతున్న మాదిరిగా పర్యటనలను రూపొందిస్తుండడం విశేషం. ఈ నెల 5వ తేదీన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ జిల్లాలో పర్యటించారు. బన్సల్ పర్యటన నేపథ్యంలో నిజామాబాద్ నగరంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. తర్వాత ఆర్మూర్, కమ్మర్‌పల్లిల్లో వివిధ వర్గాలతో సమావేశమయ్యారు. తాజాగా ఈ నెల 13వ తేదీన మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యుడు ప్రకాశ్ జవదేకర్ జిల్లాలో పర్యటించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అమరవీరుల పార్క్‌లో వాకర్స్‌తో ముచ్చటించారు. జక్రాన్‌పల్లిలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా విమానాశ్రయం ప్రతిపాదిత మనోహరాబాద్, కొలిప్యాక్, తొర్లిగొండ గ్రామాలను సందర్శించారు. విమానాశ్రయం నిర్మాణం విషయంలో కేసీఆర్ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శలు చేశారు. మాధవనగర్ వద్ద నిర్మాణంలో ఉన్న ఆర్‌వోబీని సందర్శించారు. బోధన్‌లో కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించారు. జానకంపేట నుంచి బోధన్ వరకు కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఆర్మూర్‌లో వివిధ మోర్చాల సంయుక్త సమ్మేళనం నిర్వహించారు. కేసీఆర్ పాలన అవినీతిమయమని విమర్శలు చేశారు. తాజాగా బుధవారం ప్రకాశ్ జవదేకర్ నిజామాబాద్ నగరంలోని రైల్వే కార్మికులతో ముచ్చటించారు. తర్వాత నిజామాబాద్ నగరంలోని వైద్యులతో అంతర్గతంగా సమావేశమయ్యారు. ఇద్దరు జాతీయ నాయకులు తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. గత తొమ్మిదేళ్లలో మోదీ అవినీతి రహితంగా పాలన అందిస్తున్నారన్నారు. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ నినాదంతో ముందుకు వెళుతున్నట్లు వివరిస్తున్నారు.

### అన్నీ తానై వ్యవహరిస్తున్న ఎంపీ అర్వింద్

జాతీయ నేతల కార్యక్రమాలకు సంబంధించి ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నీ తానై వ్యవహరిస్తూ పార్టీ శ్రేణులను ముందుకు కదిలిస్తున్నారు. ఇకపై వరుసగా జాతీయ నేతలు జిల్లాలో పర్యటించే విధంగా ఎంపీ అర్వింద్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అదేవిధంగా నిజామాబాద్‌లో త్వరలో అగ్రనేతలతో బహిరంగసభకు సైతం ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు.



నగరంలో ప్రైవేటు వైద్యులతో సమావేశమైన మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ ఎంపీ ప్రకాశ్ జవదేకర్

# హమాలీలకు కేంద్రం అండ



నగరంలోని రైల్వేస్టేషన్‌లో హమాలీలతో మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్

- మాజీ కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్
- రైల్వేస్టేషన్‌లో మాటామంతి

**నిజామాబాద్‌నాగారం:** కేంద్ర ప్రభుత్వం హమాలీల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకొని మరింత వృద్ధి సాధించాలని మాజీ కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ పరిధిలోని గూడ్స్ కార్మికుల భవనంలో మహాజన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా మాటమంతి నిర్వహించారు. హమాలీలతో కాసేపు ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో హమాలీలకు పనితక్కువగా ఉండేదని ప్రస్తుతం పెద్ద లైన్ కావడంతో హమాలీలకు పని ఎక్కువగా లభిస్తుందన్నారు. హమాలీలు ఎంపీని సన్మానించారు. కరోనా సమయంలో ప్రధాని మోదీ రెండు డోసుల ఇంజక్షన్లు ఫ్రీగా అందించారన్నారు. బీపీఎల్‌లో ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్‌ని అందిస్తుందన్నారు. కేంద్రం శౌచాలయాల నిర్మాణం కోసం డబ్బులు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర నాయకులు ధన్‌పాల్ సూర్యనారాయణ, యెండల లక్ష్మీనారాయణ, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు న్యాలంరాజు, మమత ప్రభాకర్ పాల్గొన్నారు.

### పేదలకు తక్కువ ధరకే వైద్యం చేయాలి

**నిజామాబాద్ సిటీ:** పేద ప్రజలకు తక్కువ ధరకే వైద్యం అందించాలని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ ఎంపీ ప్రకాశ్ జవదేకర్ సూచించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ద్వారక్‌నగర్‌లో గల ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కొంత మంది ప్రైవేటు వైద్యులతో సమావేశమై మాట్లాడారు. పిల్లలకు ఎక్కువగా ఎటువంటి జబ్బులు వస్తున్నాయని, ఆయుష్మాన్ భారత్ అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. వైరల్ ఫీవర్, డెంగీ ఎక్కువగా వస్తున్నాయని ఈ సందర్భంగా డాక్టర్లు తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రధానిగా మోదీ తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్నందున మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంలో డాక్టర్లతో మాట్లాడడానికి రావడం జరిగిందన్నారు. ఎవరైనా పేదవాళ్లు అనారోగ్యం బారినపడితే ఆయుష్మాన్ భారత్ కింద రూ. 5లక్షలు చికిత్స గురించి అందించడం జరుగుతుందన్నారు. దేశంలో డాక్టర్ల కొరత ఉండగా, రూ. లక్షా 50వేలు మెడికల్ సీట్లు ఉన్నాయని తెలిపారు. మెడికల్ కళాశాలలు 300 నుంచి 600 వరకు పెంచడం జరిగిందని, ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు కు ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్పారు. కరోనా సమయంలో సేవలందించిన డాక్టర్లు, సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది వర్కర్స్‌కు సన్మానం చేశారు.

# అర్మేనియాలో ఉపాధి పేరిట మోసం

- ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నిండా ముంచిన ఏజెంట్లు
- మోసపోయిన సుమారు 50 మంది
- అష్టకష్టాలు పడి ఇళ్లకు చేరుకున్న కొంత మంది
- మరికొందరు అక్కడే ఉండి ఇబ్బంది పడుతున్న వైనం

**మోర్తాడ్(బాల్కొండ):** విదేశాలకు వెళ్లి ఉపాధి పొందాలనుకుంటున్న తెలంగాణ యువకులకు ఏజెంట్లు కొత్త కొత్త దేశాలను పరిచయం చేస్తున్నారు. తాము ఇప్పించే వీసాలతో వలస కార్మికులకు మంచి జరుగుతుందా లేదా అని ఆలోచించకుండా తమ జేబులు నిండితే సరిపోతుందనే భావనలో ఉన్న ఏజెంట్ల వైఖరితో నిరుద్యోగులు నిండా మునిగిపోతున్నారు. తాము వెళ్లే దేశంలో ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయని తెలుసుకోకుండా వెళ్లి ఏజెంట్ల ఉచ్చులో చిక్కుకుని వలస కార్మికులు విలవిల్లాడుతున్నారు. నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన నలుగురు ఏజెంట్లు అర్మేనియా దేశానికి సుమారు 50 మంది నిరుద్యోగులను పంపించారు. వర్క్ వీసా కాకుండా విజిట్ వీసా కోసమే రూ. 3.50 లక్షల నుంచి రూ. 5లక్షల వరకు వసూలు చేశారు. అర్మేనియాలో అడుగుపెట్టిన తర్వాత వలస కార్మికులకు ఆ దేశం మన కంటే పేదదని తెలిసింది. మన కరెన్సీతో పోల్చితే అక్కడి కరెన్సీ చాలా రేట్లు తక్కువ. ఒక అర్మేనియా డ్రమ్ విలువ మన వద్ద 21 పైసలతో సమానం. అక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వలస కార్మికుల్లో కొందరు తిరిగి వచ్చారు. మరి కొందరు ఇంటికి రావడానికి అష్టకష్టాలు పడుతున్నారు. విజిట్ వీసాపై ఆ దేశం వెళ్లి అక్కడ చట్టవిరుద్ధంగా ఉండడం వల్ల జరిమానా చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఇంటికి వచ్చిన వలస కార్మికులు మన కరెన్సీలో రూ. 25వేల వరకు జరిమానా చెల్లించినట్లు పలువురు తెలిపారు. విమాన టిక్కెట్‌ను కూడా సొంతంగానే సమకూర్చుకుంటున్నారు. ఏజెంట్లకు చెల్లించిన సొమ్మును కోల్పోవడమే కాకుండా జరిమానా, రిటర్న్ విమాన చార్జీల భారం మోయడంతో ఒక్కో కార్మికుడు రూ. 6.50లక్షల వరకు నష్టపోయాడు. విదేశీ మోజులో ఉన్న యువతను ఏజెంట్లు ఎలా మోసం చేస్తున్నారని చెప్పడానికి అర్మేనియాలో ఉపాధి పేరిట వంచననే నిదర్శనమని వలస కార్మికుల సంఘాల నాయకులు చెబుతున్నారు.

# ఎన్నికల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇన్‌చార్జి సీపీ, తదితరులు

**సుభాష్‌నగర్ :** సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా ఎన్నికల నిర్వహణ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై దృష్టి కేంద్రీ కరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. ఓటరు జాబితాలో తమ పేరు తొలగించారని అర్హులైన ఏ ఒక్క ఓటరు నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని, జాబితా పూర్తి పారదర్శకంగా ఉండేలా పరిశీలించాలన్నారు. కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు.

ఎన్నికల ఏడాది కావడంతో ఓటరు జాబితా పునఃపరిశీలించుకుని లోటుపాట్లు ఉంటే వెంటనే సరి చేసుకోవాలని తెలిపారు. 2018, 2019 ఎన్నికల సమయంలో ఓటరు జాబితాతో పోలిస్తే, ఓటర్ల సంఖ్య తగ్గినట్లయితే అందుకు గల కారణాలు పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిశీలన జరిపే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఓటర్ల మార్పులు–చేర్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, ఈనెల 23 నాటికి ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి పోస్టల్ శాఖ ద్వారా ఓటరు గుర్తింపు కార్డు అందించే ప్రక్రియ కొనసాగించాలన్నారు. ఇప్పటికే ఈవీఎంల ప్రాథమిక పరిశీలన ప్రక్రియ ఆయా జిల్లాల్లో ప్రారంభమైందని గుర్తుచేశారు. జూలై 01 నాటికి పరిశీలన ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. పోలింగ్ స్టేషన్లు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని, తప్పనిసరిగా ర్యాంపులు ఏర్పాటు చేయించాలన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్ర సగటు కంటే తక్కువ పోలింగ్ నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఎన్నికల నియమావళి తు.చ తప్పకుండా అమలయ్యేలా చూడాలని, భద్రతాపరమైన ఏర్పాట్లపై దృష్టి కేంద్రీకరించాలని డీజీపీ అంజనీకుమార్ యాదవ్ పోలీస్ కమిషనర్లు, ఎస్పీలకు సూచించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్ కుమార్, ట్రెయినీ అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, నియోజకవర్గాల ఎన్నికల అధికారులు డీఆర్‌డీవో చందర్, జెడ్పీ సీఈవో గోవింద్, ఆర్డీవోలు రవి, రాజేశ్వర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.

# జీతాల కోసం హైడ్రామా..

- మూడోరోజూ విధులు బహిష్కరించిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది
- భోజనం లేక విద్యార్థుల అవస్థలు
- వీసీని ఘెరావ్ చేసిన సిబ్బంది, విద్యార్థులు
- నేడు సమస్య కొలిక్కి వచ్చే అవకాశం..?



తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌ను నిలదీస్తున్న, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు

**తెయూ(డిచ్‌పల్లి):** జీతాలు ఇచ్చే వరకు విధులు నిర్వహించేది లేదని పేర్కొంటూ తెలంగాణ వర్సిటీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేపట్టిన నిరసన బుధవారం మూడో రోజూ కొనసాగింది. ఉదయాన్నే పరిపాలనా భవనం వద్ద సిబ్బంది బైఠాయించారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిరవధిక ధర్నా వల్ల మంగళవారం మధ్యాహ్నం నుంచి క్యాంపస్ హాస్టల్స్ విద్యార్థులకు భోజనం వండకపోవడంతో పస్తులున్నారు. హాస్టల్స్ చీఫ్ వార్డెన్ రాత్రికి బయట నుంచి భోజనాలు తెప్పించారు. తిరిగి బుధవారం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ధర్నా చేపట్టారు. ఉదయం హాస్టల్స్‌లో అల్పాహారం చేయలేదు. చీఫ్ వార్డెన్ సెలవులో ఉండడంతో పట్టించుకునే వారే కరువయ్యారు. విద్యార్థులు పీఆర్‌వో జమీల్‌కు చెప్పడంతో ఆయన వీసీతో మాట్లాడారు. వీసీ ఆదేశాలతో బయట నుంచి అల్పాహారం తెప్పించారు. ఉదయం 11 గంటలకు వీసీ క్యాంపస్‌కు చేరుకున్నారు. అప్పటికే ధర్నా నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు వీసీ లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వకపోవడంతోనే ఈ దుస్థితి తలెత్తిందని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాలు ఇచ్చేవరకు తాము విధులు నిర్వహించేది లేదని సిబ్బంది వీసీకి స్పష్టం చేశారు. దీంతో వీసీ బ్యాంకు మేనేజర్‌ను పిలిపించి మాట్లాడారు. హైకోర్టులో కేసు ఉందని అందుకే జీతాల చెక్కును ఆమోదించలేకపోతున్నట్లు మేనేజర్ వివరించారు. ఈ విషయాన్ని మంగళవారం రాత్రే వీసీ రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకయ్యకు ఫోన్‌లో చెప్పానని పేర్కొన్నారు. వీసీతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు వాగ్వాదానికి దిగడంతో చివరకు మేనేజర్‌తో మాట్లాడి జీతాలు ఇచ్చేలా చూస్తానని చెప్పి వీసీ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌లు బ్యాంకులోకి వెళ్లారు. అదేసమయంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సత్యనారాయణ క్యాంపస్‌కు వచ్చారు. జీతాల చెల్లింపునకు వీసీ నియమించిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకయ్య సంతకం ఆమోదించాలంటే ఈసీ నుంచి ఎన్‌వోసీ తేవాలని, ఈసీ నియమించిన రిజిస్ట్రార్ యాదగిరి సంతకం ఆమోదించాలంటే వీసీ ఎన్‌వో సీ ఇవ్వాలని బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. ఈ రెండు కాదంటే హైకోర్టులో కేసు ఉండడంతో జీతాలు ఇవ్వడానికి అభ్యంతరం లేదని మధ్యంతర ఉత్తర్వులు తేవాలని సూచించారు. దీంతో వీసీ సూచన మేరకు కనకయ్య కొందరు ఈసీ మెంబర్లకు ఫోన్ చేసి పరిపాలనా భవనానికి రావాలని కోరారు. దీంతో ఈసీ మెంబర్ ఎస్ఎల్‌శాస్త్రి మాత్రమే వచ్చారు. బ్యాంకు అధికారుల సూచనలు విన్న ఆయన వీసీతో మాట్లాడారు. ఫోన్లలో మాట్లాడితే ఈసీ మెంబర్లు స్పందించకపోవచ్చని, ఈనెల 17న ఈసీ సమావేశానికి హాజరైతే సమస్యపై చర్చించవచ్చన్నారు. సమావేశానికి హాజరైతే వీసీ, ఈసీ మధ్య అంతరం తొలిగే అవకాశం ఉంటుందని సూచించారు. ఒకసారి ఈసీ మెంబర్లతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని వీసీ పేర్కొన్నారు. అంతకు ముందు వీసీ తన చాంబర్‌కు వెళ్ల డానికి యత్నించగా విద్యార్థులు మెట్లపై ఉన్న పూలకుండీలను పగులగొట్టారు. చాంబర్ తాళం తీయకపోవడంతో చేసేది లేక వీసీ బయటకు వచ్చారు. విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం ఆర్డర్ ఇవ్వగా.. సాయంత్రం 6 గంటలకు రావడంతో ఆకలితో ఉన్న విద్యార్థులు అప్పుడు భోజనాలు చేసి హాస్టల్స్‌కు వెళ్లారు. తమకు కనీసం ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా అయినా జీతాలు ఇప్పించాలని ఉద్యోగులు వీసీని కోరారు. దీంతో వీసీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వారితో ఫోన్‌లో మాట్లాడి ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని సూచించారు.

# ఉత్తమ సర్పంచులకు ఆహ్వానం

- దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నేడు హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి..

**సుభాష్‌నగర్:** దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ కింద ఇటీవల ఎంపికైన ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. తొమ్మిది థీమ్‌లలో(కేటగిరీ) పరిశీలన జరిపి ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన 27 గ్రామ పంచాయతీలను గుర్తించిన విషయం తెలిసిందే. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమానికి ఉత్తమ సర్పంచులను ఆహ్వానించారు. ఇందుకోసం డీపీవో డాక్టర్ జయసుధ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సర్పంచులతోపాటు మరో ఇద్దరు మల్టీపర్పస్ కార్మికులను కూడా తీసుకెళ్లనున్నారు. జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్‌డీవో చందర్, డీపీవో జయసుధతో పాటు 27 మంది సర్పంచులు, ఇద్దరు కార్మికులు హైదరాబాద్ వెళ్లేందుకు బస్సును ఏర్పాటుచేశారు. మల్టీపర్పస్ కార్మికులు మోపాల్ మండలం సింగంపల్లికి చెందిన జోగు అమ్మక్క, మెండోరా మండలం బుస్సాపూర్‌కు చెందిన మారుతిని కార్యక్రమంలో సన్మానించనున్నారు.

**పరిశీలన జరిగిన కేటగిరీలు**

తొమ్మిది థీమ్‌లలో (కేటగిరీ) పరిశీలన జరిపి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన 27 ఉత్తమ గ్రామపంచాయతీలను ఎంపిక చేశారు. పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి పంచాయతీలు, ఆరోగ్యకరమైన పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ, సరిపడా నీళ్లు కలిగిన పంచాయతీలు, పచ్చదనం, పరిశుభ్రత పంచాయతీలు, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు కలిగిన పంచాయతీలు, సామాజిక భద్రత కలిగిన పంచాయతీలు, సుపరిపాలన పంచాయతీలు, మహిళా స్నేహ పూర్వక పంచాయతీ థీమ్‌లలో ఎంపికయ్యాయి.

# ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

- మొదటి రోజు 600 మంది హాజరు
- ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం


**ఖలీల్‌వాడి:** ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం టీఎస్ఎల్‌పీఆర్‌బీ- 2022 సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు అదనపు డీసీపీ(ఏఆర్) గిరిరాజు ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించారు. అభ్యర్థులు తీసుకొని వచ్చిన సర్టిఫికెట్లను పరిశీలించారు. మొదటి రోజు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 600 మంది అభ్యర్థులను పిలిచారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి(ఏవో) శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, మక్సూద్ హైమద్, గోవింద్, సీపీవో కార్యాలయం సిబ్బంది, రిజర్వు విభాగం సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తున్న సిబ్బంది

# కమిషనరేట్‌లో కీలక పోస్టులు ఖాళీ!

- భర్తీకాని సీపీ, డీసీపీ పోస్టులు
- నిర్మల్ ఎస్పీకి ఇన్‌చార్జి సీపీ బాధ్యతలు



**ఖలీల్‌వాడి:** నిజామాబాద్ పోలీస్‌కమిషనర్ పోస్టు ఖాళీ అయి రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు ప్రభుత్వం భర్తీ చేయలేదు. అలాగే డీసీపీ పోస్టులు సైతం ఖాళీగానే ఉన్నాయి. జిల్లాకు మూడు డీసీపీ పోస్టులు ఉండగా ఒక పోస్టు ఖాళీ ఉండగా ఇద్దరు డీసీపీలు ఉషా విశ్వనాథ్, అరవింద్‌బాబులు బదిలీ అయ్యారు. ఈ మూడు పోస్టులకు గత ఆరు నెలలుగా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. తాజాగా రెండు నెలల క్రితం సీపీగా కెఆర్ నాగరాజు పదవీ విరమణ చేసిన మూడు నెలలు కావస్తున్న ఇంత వరకు సీపీ పోస్టును భర్తీ చేయలేదు. జిల్లాకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు తమకు కావాల్సిన వారి పేర్లను సూచించడంతో జిల్లాకు సీపీ కేటాయింపులో తాత్సారం ఏర్పడినట్లు తెలిసింది. ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడంతో జిల్లాకు ఐపీఎస్ అధికారులు వచ్చేందుకు సుముఖత చూపలేదని పోలీస్ వర్గాల్లో చర్చ జరిగింది.

**ఈ నెలాఖరుకు భర్తీకి రంగం సిద్ధం..**

నిజామాబాద్ పోలీస్‌కమిషనర్‌గా ఇన్‌చార్జి సీపీగా నిర్మల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ గత రెండు నెలలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీపీతోపాటు ముగ్గురు డీసీపీ పోస్టులు ఖాళీగా ఉండటంతో సీనియర్‌గా ఉన్న ఎస్బీ ఏసీపీ మధుసూదన్‌రావుకు డీసీపీ అడ్మిన్ బాధ్యతలు ఇచ్చారు. రెండు రోజుల క్రితం పదోన్నతులలో ఏసీపీ మధుసూదన్‌రావుకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌కు సైతం అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించగా ఆర్మూర్‌లోనే ఏసీపీగా పని చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఏసీపీకి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధి అభయం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. సీపీ కోసం జిల్లాకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ఇద్దరు పేర్లను ప్రతిపాదించడంతో ఈ పోస్టును తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఇద్దరు ప్రజాప్రతినిధులు సూచించిన పేర్లను కాకుండా రాష్ట్రప్రభుత్వం దృష్టికి పోలీసుశాఖ మరో ఇద్దరి పేర్లను ప్రతిపాదించినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 31వరకు జిల్లాలో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతోపాటు అన్ని శాఖల అధికారులను బదిలీ చేయాలని సూచించింది. కేంద్ర ఎన్నికల కమిటీ సూచనతో ఈ నెల ఆఖరు వరకు సీపీగా నియమిస్తారనే చర్చ పోలీస్ వర్గాలలో వినిపిస్తోంది. దశాబ్ది ఉత్సవాలను ముగింపు తర్వాత ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు వెలువరించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

**తెరపైకి పలువురి పేర్లు..**

జిల్లాలో ఇప్పటికే అన్ని డిపార్ట్‌మెంట్‌లలో బదిలీల చర్చ జరుగుతోంది. అందులో భాగంగా పోలీస్‌శాఖలో బదిలీ ప్రక్రియ ఊపందుకుంది. గతంలో సీపీ పోస్టు ఖాళీ కావడంతో కెఆర్. నాగరాజుతోపాటు పోటీపడిన శ్రీనివాస్ రావు, వెంకటేశ్వర్ల పేర్ల తెరపైకి వచ్చాయి. ఇప్పటికే జిల్లాకు మహిళ సీపీ వస్తారనే ప్రచారం ఉండగా.. తాజాగా ఈ పేర్లు పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో తమకు అనుకూలంగా ఉండే సీపీ కోసం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు చూస్తున్నట్లు తెలిసింది. జిల్లాలోని ఇద్దరు ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన వారిని కాకుండా సీఎంవోలో పని చేస్తున్న పోలీస్ ఉన్నతాధికారితో పాటు మరో పేరు మళ్లీ తెరపైకి వచ్చినట్లు తెలిసింది. ఏదిఏమైనా కేంద్ర ఎన్నికల కమిటీ ఇచ్చిన గడువు మేరకు ఈ నెల ఆఖరు వరకు సీపీతోపాటు ముగ్గురు డీసీపీ పోస్టులను నియమించే అవకాశాలు ఉన్నాయి.

## క్లుప్తంగా

### జిల్లా మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు కాంగ్రెస్‌లో చేరిక



**కామారెడ్డి టౌన్:** బీజేపీ మహిళా మోర్చా జిల్లా మాజీ అధ్యక్షురాలు దత్తేశ్వరి బీజేపీకి రాజీనామా చేసి మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆమెకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... సిద్ధాంతాలు లేని బీజేపీలో ఇమడలేక పార్టీకి రాజీనామా చేశానన్నారు. జరిగిందన్నారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. బీజేపీలో మహిళలకు గౌరవం లేదన్నారు. బీజేపీ బీఆర్ఎస్‌తో కుమ్మక్కై కేసీఆర్ కూతురు కవిత లిక్కర్ స్కాంలో అడ్డంగా దొరికినా ఆమెను వదిలేసారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చందు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొనె శ్రీను, జిల్లా కార్యదర్శి పంపరి లక్ష్మణ్, మున్సిపల్ కౌన్సిలర్ శివ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్యాంసుందర్



**ఎడపల్లి(బోధన్):** రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులుగా మండలంలోని ఠాణాకాలన్‌కు చెందిన శ్యాంసుందర్ వరమోగిని నియామిస్తూ బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రకటించారు. శ్యాంసుందర్ ఆర్ఎస్ఎస్‌లో ప్రచారక్‌గా పని చేశారు. అనంతరం బీజేపీలో చేరా రు. శ్యాంసుందర్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో కీలక బాధ్యతలు ఇచ్చినందుకు బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు.

### కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

**నిజామాబాద్‌అర్బన్:** ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం గణితం, వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం పరీక్షలు జరిగాయి. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం రెండో సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. ఉదయం మొత్తం 7,438 మంది విద్యార్థులకు 7,046 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 6882 మందికి గాను 6,511 మంది హాజరయ్యారు. ఒకేషనల్ 556మందికి గాను 535 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం రెండో సంవత్సరం విద్యార్థులు 3157 మందికి గాను 3020 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్‌లో 2938 మంది విద్యార్థులకు గాను 2813మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ 219 మందికి గాను 207మంది హాజరయ్యారు. జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ ఉదయం 4 పరీక్ష కేంద్రాలను, మధ్యాహ్నం 2 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారూ. ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్‌లు 35 పరీక్ష కేంద్రాలను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 14 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

# తెలంగాణ వైద్యరంగం దేశానికి ఆదర్శం



వైద్య ఆరోగ్యశాఖ దినోత్సవంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

- పేదల ముంగిట కార్పొరేట్ వైద్యం
- అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా
- ఘనంగా వైద్య, ఆరోగ్య దినోత్సవం

**నిజామాబాద్ సిటీ:** ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ వైద్య రంగం విప్లవాత్మక మార్పులతో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో బుధవారం వైద్య ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, జ్యోతి వెలిగించి, పోస్టర్లను ఆవిష్కరించారు. సీఎం మార్గదర్శకత్వంలో వైద్య సిబ్బంది కృషితో తెలంగాణ వైద్య రంగం దేశానికి దిక్సూచిగా మారిన శుభసందర్భంగా, వైద్యులకు, వైద్య సిబ్బందికి ఎమ్మెల్యే ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రయివేట్ ఆస్పత్రిలకు ధీటుగా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. మన రాష్ట్రంలో అందుతున్న వైద్య సేవల తీరు ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలలో అమలు చేస్తామని ఆ రాష్ట్రాల సీఎంలు కేజ్రీవాల్, భగవంత్ మాన్‌సింగ్ తెలుపటం దీనికి నిదర్శనమన్నారు. నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మహిళ కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మీ, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా, డీఎంహెచ్‌వో సుదర్శనం పాల్గొన్నారు.

**జీజీహెచ్‌లో రోగులకు పండ్ల పంపిణీ**

వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జీజీహెచ్‌లోని రోగులకు పండ్లు, కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేసిన 'కేసీఆర్ బువ్వ కుండ' కేంద్రంలో రోగులకు వారి సహాయకులకి భోజనాన్ని వితరణ చేశారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించం!



వర్నిలో ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న స్పీకర్ పోచారం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- డీఎంహెచ్‌వోపై ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

**వర్ని:** విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. మండల కేంద్రంలో నిర్మించనున్న ఆస్పత్రి భవన నిర్మాణానికి బుధవారం స్పీకర్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్ని 30 పడకల ఆస్పత్రిలో నలుగురు డాక్టర్లు ఉండగా.. వీరిలో ముగ్గురిని డిప్యూటేషన్‌పై పంపడంతో స్పీకర్ డీఎంహెచ్‌వో సుదర్శనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా నా నియోజకవర్గం నుంచి అధికారులను, డాక్టర్లను ఇతరులను ఎవరిని అయినా బదిలీ కానీ డిప్యూటేషన్ కానీ చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. వర్ని ఆస్పత్రి నుంచి డిప్యూటేషన్‌పై పంపిన వారిని రేపటిలోగా తిరిగి ఆస్పత్రిలో జాయిన్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫోన్లో ఆదేశించారు. వారు విధుల్లో చేరకపోతే ఆస్పత్రికి తాళం వేయండని సిబ్బందికి ఆదేశించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా 4వేల బెడ్స్‌తో నిమ్స్ ఆస్పత్రి పునర్నిర్మాణం చేపడుతున్నట్లు స్పీకర్ వెల్లడించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టిక ఆహార కిట్లను అందిస్తున్నామన్నారు. అలాగే కోటగిరిలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్పీకర్ పోచారం భూమిపూజ చేశారు. ఎంపీపీ శ్రీలక్ష్మీ వీర్రాజు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్, సహకార సంఘం అధ్యక్షులు సాయిబాబా, తహసీల్దార్ విఠ్ఠల్, ఎంపీడీవో బషీరుద్దీన్, నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# నీట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



జాగృతి వెంకటరమణ స్నేహ

**నిజామాబాద్‌అర్బన్/నిజామాబాద్‌సిటీ:** నీట్ ఫలితాల్లో కాకతీయ విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన జాగృతి 584మార్కులు, వెంకటరమణ 494, స్నే హ 462, అశ్వర్య -445, సోని-423, రాజశ్రీ-409 మార్కులు సాధించారు. వీరిని కళాశాల డైరెక్టర్ రజనీకాంత్, విద్యాసంస్థల చైర్మన్ విజయలక్ష్మి అభినందించారు.

**ఎస్ఆర్ కళాశాల ప్రభంజనం..**



లక్ష్మీకాంత్, చాగంటి సాహితి, మెహనాజ్ తస్లీమ్



పావని

నీట్ ఫలితాలలో జిల్లా కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థా యి నీట్‌లో ఉత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల జోనల్ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. 8మంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి, ఉచిత మెడికల్ సీట్లు సాధించినట్లు తెలిపారు. లక్ష్మీకాంత్ 516మార్కులు, చాగంటి సాహితీ 466 మార్కులు, మెహనాజ్ తస్లీమ్ 462 మార్కులు, మాస్టర్ పావని 459 మార్కులు, సముద్రాల శ్రీ వైష్ణవి 454 మార్కులు, భాశెట్టి సాహిత్ 449 మార్కులు, జాదవ్ సియారాణి 435మార్కులు, బానోత్ 432 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు ఈసందర్భంగా వారిని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదరెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందించారు

**'ఎస్ఎస్ఆర్ డిస్కవరీ'కి ఉత్తమ మార్కులు..**



శ్రేయస్ కమలకాంత్ ఉత్తర్వార్

నగరంలో ఎస్ఎస్ఆర్ డిస్కవరి విద్యార్థులు నీట్ ఫలితల్లో ఉత్తమ మార్కు లు సాధించారు. శ్రేయస్ కమలకాంత్ ఉత్తర్వార్ 524 మార్కులు సాధించాడు. ఈసందర్భంగా విద్యార్థి ని స్కూల్ చైర్మన్ మారయ్యగౌడ్ అభినందించాడు.

**వెక్టర్ విద్యార్థుల ప్రభంజనం..**

నగరంలోని వెక్టర్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు నీట్‌లో ఉత్తమ మార్కులు సాధించారు. నితిన్‌కుమార్ 544 మార్కులు, సిహెచ్ నిషితరెడ్డి 428 మార్కులు, మహితారాణి 402 మార్కులు, సాయి ఈశ్వరి 23,462 ర్యాంకు, బాదవత్ నవ్య శ్రీ 24367ర్యాంకు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ మధుసూదన్ జోషి తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.



నిషితరెడ్డి నితిన్

**'విజయసాయి' పూర్వ విద్యార్థులు..**



పూజ ప్రశాంతి ప్రతీక్ష



ఫరీహా యామన్

**బోధన్:** పట్టణంలోని విజయసాయి హైస్కూల్ పదోతరగతి (2020-21 బ్యాచ్) పూర్వ విద్యార్థులు నీట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. పూజ 408 మార్కులు, ఎస్టీ కెటగిరిలో ఆలిండియా 3500ర్యాంకు, ఎ ప్రశాంతి 473 మార్కులు, ఎస్సీ కెటగిరిలో ఆలిండియా 7 వేల ర్యాంకు, ప్రతీక్ష 579 మార్కులు, ఆలిండియా 42వేల ర్యాంకు, ఫరీహా యామన్ 638 మార్కులు, ఆలిండియా 10,735 ర్యాంకు సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.కృష్ణ మోహన్ తెలిపారు.

# హీరో ఫ్యాషన్ ప్లస్ బైక్ ఆవిష్కరణ



బైక్‌ను ఆవిష్కరిస్తున్న ఎండీ వికాస్‌రెడ్డి

**నిజామాబాద్ సిటీ:** నగరంలోని శ్రీ సాయి దుర్గ మోటార్స్ షోరూంలో బుధవారం నూతనంగా ప్రవేశ పెట్టిన హీరో ఫ్యాషన్ ప్లస్ కొత్త బైక్‌ను షోరూం మేనేజింగ్ డైరెక్టర్ కాట్‌పల్లి వికాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వికాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అద్భుతమైన ఫీచర్స్ కలిగినటువంటి ఈ బైక్‌ను వినియోగదారులు ఎంచుకోవాలని సూచించారు. సర్వీస్ టీఎస్ఎం జితేందర్ రెడ్డి, జనరల్ మేనేజర్ అమరేందర్ రెడ్డి, నెట్‌వర్క్ మేనేజర్ వినీత్, పీడీఐ మేనేజర్ మురళి, షోరూమ్ ఉద్యోగులు, కస్టమర్లు పాల్గొన్నారు.

# విద్యుత్‌శాఖ ఏడీ హామీతో ఆందోళన విరమణ

**ధర్పల్లి:** మండలంలోని రేకులపల్లి గ్రామంలో మంగళవారం పొలం వద్ద బోర్ మోటార్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ గురై ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. రేకులపల్లి లైన్‌మన్ నిర్లక్ష్యంతోనే వారు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాలను తరలించకుండా అడ్డుకున్నారు. సీఐ సైదా విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వగా ఏడీ శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులకు, బంధువులకు అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో బుధవారం వేకువజామున 3గంటలకు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు సీఐ తెలిపారు. మృతుడు రమేష్ భార్య ఫిర్యాదు మేరకు లైన్‌మన్ నజీర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.


### వర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేయాలి



**తెయూ(డిచ్‌పల్లి):** రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ యూనివర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయాగౌడ్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయిస్ కాన్ఫడరేషన్ పిలుపు మేరకు బుధవారం తెయూలో 'డిమాండ్ డే ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయాగౌడ్ మాట్లాడుతూ.. వర్సిటీ ఉద్యోగులకు పెన్షన్ స్కీం, పేస్కేల్ అలవెన్స్ అమలు చేయాలన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ భాస్కర్, జాయింట్ సెక్రెటరీ వినోద్, ట్రెజరర్ జ్యోతి, ఈసీ మెంబర్స్ శ్రీవాణి, వైస్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

# సాదిక్ హత్య కేసులో ఊహించని ట్విస్ట్

- నిందితులు తమ్ముళ్లు కాకుండా వేరే వ్యక్తులు!



సాదిక్ (ఫైల్)

**కామారెడ్డి క్రైం:** కామారెడ్డి పాత బస్టాండ్ ప్రాంతంలో ఈ నెల 8న జరిగిన మహ్మద్ సాదిక్(50) హత్య కేసు ఊహించని మలుపు తిరిగినట్లు తెలుస్తోంది. తల్లి దగ్గరున్న బీమా డబ్బుల పంపకాల విషయంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం సాదిక్ హత్యకు దారితీసిందని, అతని తమ్ముళ్లు అయిన అంజాద్, సలీంలే హత్య చేసి ఉండవచ్చని అందరూ భావించారు. పోలీసులు కూడా వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. కానీ ఈ హత్య కేసులో ఊహించని ట్విస్ట్ ఎదురైనట్లు తెలిసింది. హత్య జరిగిన చోట మరో వ్యక్తి ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. మృతుడి వద్ద కనిపించిన నగదు కోసం అతడే ఈ హత్య చేసి ఉంటాడని పోలీసులు విశ్వసిస్తున్నారు. ఈ నెల 7న రాత్రి ముగ్గురు అన్నదమ్ములు సాదిక్, అంజాద్, సలీంలు సిరిసిల్లా రోడ్డులోని ఓ వైన్స్ పర్మిట్‌రూంకు వెళ్లారు. రాత్రి 10:30 గంటల ప్రాంతంలో పాతబస్టాండ్ ప్రాంతంలో సాదిక్ హత్యకు గురయ్యాడు. అతడిని బండరాళ్లతో మోది హత్యచేశారు. డబ్బుల విషయంలో గొడవలు తలెత్తడంతో తమ్ముళ్లే హత్య చేసి ఉంటారని అందరూ భావించారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా ఆధారాలను సేకరించారు. అన్ని కోణాల్లోనూ విచారణ జరిగింది. అన్నదమ్ములు ముగ్గురు కలిసి పర్మిట్ రూంలో మద్యం సేవించి పాతబస్టాండ్ ప్రాంతానికి కలిసే వచ్చారు. అక్కడి నుంచి ఎవరి ఇళ్లకు వారు వెళ్దామనుకున్నారు. కానీ కొద్ది సేపటి తర్వాత సాదిక్ హత్యకు గురయ్యాడు. సాదిక్‌ను కొట్టి చంపింది అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి అని విచారణలో వెల్లడైనట్లు సమాచారం. సాదిక్ ఒంటిరిగా ఉన్నప్పుడు అతని దగ్గర ఉన్న నగదును చూసి క్షణికావేశంలో డబ్బుల కోసం హత్య చేసినట్లు తెలుస్తోంది.



## క్రైం కార్నర్

### కుక్కల దాడిలో పలువురికి గాయాలు

**పెర్కిట్(ఆర్మూర్):** ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో బుధవారం కుక్కలు దాడి చేసిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న పది సంవత్సరాల శ్రీజ అనే చిన్నారితో పాటు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిపాల్‌ను, మరో ఇద్దరిపై కుక్కలు దాడి చేసి, కరిచాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో పెరిగిపోయిన కుక్కల బెడదను అరికట్టడానికి గ్రామ పంచాయతీ పాలక వర్గం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### గడ్డివాము దగ్ధం



**ఎడపల్లి(బోధన్):** మండలంలోని జానకంపేటలో మజీద్ అనే వ్యక్తికి చెందిన గడ్డివాములకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అగ్నికి దగ్ధమయ్యాయి. సుమారు రూ.ఒక లక్ష ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. మజీద్ పశువుల కోసం వంద ఎకరాల గడ్డిని కొని, గడ్డివాములో స్టోరేజ్ చేసుకోగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా పూర్తిగా గడ్డివాము దగ్ధమైంది. ఫైర్‌ఇంజన్‌తో మంటలను ఆర్పించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

### ఐదు ఇసుక టిప్పర్ల పట్టివేత



**బోధన్ రూరల్ (బోధన్):** మండలంలోని సిద్ధాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణకు పాల్పడుతున్నారన్న సమాచారంతో బోధన్ రూరల్ పోలీసులు ప్రత్యేక తనిఖీ నిర్వహించి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు టిప్పర్లను పట్టుకున్నారు. అనంతరం టిప్పర్లను బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఇసుకను తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. గ్రామాల్లో ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని, అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సందీప్ తెలిపారు.

### బాల్య వివాహం అడ్డగింత

**మోపాల్(నిజామాబాద్‌రూరల్):** మండలంలోని ముదక్‌పల్లిలో బుధవారం బాల్యవివాహాన్ని ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులు అడ్డుకున్నారు. నవీపేట్‌కు చెందిన బాలిక(16)కు, ముదక్‌పల్లికి చెందిన వెంకట్‌కు ఇచ్చి వివాహం చేసేందుకు పెద్దలు నిశ్చయించారు. దీంతో సమాచారం అందుకున్న ఐసీడీఎస్, ఐసీపీఎస్ అధికారులు ముదక్‌పల్లి తండాకు చేరుకుని వివాహాన్ని అడ్డుకున్నారు. బాలరక్షా భవన్ కో ఆర్డినేటర్ గాలి విజయలక్ష్మి, నిజామాబాద్ అర్బన్ సీడీపీవో సౌందర్య, బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్‌ను రెస్క్యూ చేసి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపర్చి, సఖి సెంటర్‌కు తరలించారు. అమ్మాయికి మైనర్ తీరే వరకూ పెళ్లి చేయవద్దని ఇరువురికి కౌన్సెలింగ్ ఇస్తూ ఒప్పందపత్రం రాయించుకున్నారు. మైనర్లకు పెళ్లి చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. చట్టాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జకీరా బేగం, జమ్రు, ఐసీపీఎస్ బాబురావు, ఎంఆర్ఐ రాజేశ్వర్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధుడి అదృశ్యం

**మోపాల్:** కులాస్‌పూర్‌కు చెందిన ఆడ్డి గంగారాం(78) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు మోపాల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ బుధవారం తెలిపారు. ఈనెల 12న సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఇంటినుంచి బయటకు వెళ్లిన గంగారం తిరిగి రాలేదు. కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో చెప్పారు.

### జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య



పెద్ద సాయిలు (ఫైల్)

**లింగంపేట(ఎల్లారెడ్డి):** మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శంకర్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కుర్మ సూర్ణ పెద్ద సాయిలు(60), లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఒక కొడుకు ఉన్నారు. ఇద్దరు కూతుర్లకు పెళ్లిళ్లు జరిగాయి. ఉన్న ఒక్క కొడుకు సంజీవ్ 20 రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటినుంచి పెద్ద సాయిలు మూడిగా ఉండేవాడు. ఈక్రమంలో పెద్దసాయిలు మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనము చేసి, రోజులాగే ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో పడుకున్నాడు. బుధవారం ఉదయం లేచి చూసేసరికి రేకుల షెడ్డులో ఉరేసుకొని మృతిచెంది ఉన్నాడు. జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని మృతి చెందినట్లు భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**మనస్తాపం చెంది యువకుడు..**



శ్రీధర్ (ఫైల్)

**మోపాల్(నిజామాబాద్‌రూరల్):** మండలంలోని మంచిప్ప గ్రామంలో ఓ యువకుడు మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. భిక్కనూర్‌కు చెందిన శ్రీధర్(26), మంచిప్పకు చెందిన ప్రవళికకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఏడాది కాలంగా ఇరువురు మంచిప్పలోనే నివసిస్తున్నారు. శ్రీధర్ బైక్ మెకానిక్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం స్నేహితుడి తల్లి అంత్యక్రియలకు కామారెడ్డికి వెళ్లి వచ్చి గదిలో నిద్రపోయాడు. సాయంత్రమైనా గదిలో నుంచి బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన భార్య చుట్టుపక్కల వారితో కలిసి తలుపులు తెరిపించారు. అప్పటికే శ్రీధర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రాస్పత్రికి తరలించారు. మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి తండ్రి భూషణం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.కాగా భిక్కనూర్‌కు వెళ్లిపోదామని శ్రీధర్, మంచిప్పలోనే తల్లిగారింటి వద్ద ఉందామని ఆయన భార్య అనడంతో తరచూ వీరిమధ్య గొడవలు జరిగేవని గ్రామస్తులు, కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.